## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబాబాద్ అర్బన్:** జిల్లాలో 2023–24 సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీంలో భాగంగా ఒకటో తరగతిలో నాన్ రెసిడెన్షియల్, ఐదో తరగతిలో రెసిడెన్షియల్‌లో ప్రవేశాలకు గాను ఎస్సీ బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఇన్‌చార్జ్ అధికారి సన్యాసయ్య సోమవారం తెలిపారు. ఒకటో తరగతిలో 47సీట్లు, ఐదో తరగతిలో 50సీట్లు కేటాయించారని, ఈ నెల 4నుంచి 15వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులు జిల్లా కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.2లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కులం, నివాసం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 3పాస్‌ఫొటోలు, పాఠశాల నుంచి గత సంవత్సర మార్కుల లిస్ట్, అన్ని జిరాక్స్ పత్రాలపై గెజిటెడ్ అధికారి సంతకం ఉండాలని సూచించారు. ఒకటో తరగతిలో ప్రవేశం కోసం 1-9-2017 నుంచి 31-8-2018 మధ్యలో జన్మించి ఉండాలని, ఐదో తరగతిలో ప్రవేశం కోసం 1-9-2013 నుంచి 31-8-2014 మధ్యలో జన్మించి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**కురవి:** డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తున్నాయని ఆత్మ చైర్మన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోటలాలయ్య అన్నారు. సోమవారం మండలంలోని రాజోలు గ్రామంలో ఎమ్మెల్యే సీడీఎఫ్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ మస్తాన్, నాయకులు అంబటి విష్ణువర్ధన్, వెంకన్న, నాగేష్ పాల్గొన్నారు.

### భూమి పూజ

**తొర్రూరు రూరల్:** ప్రజలు ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని ఎర్రబెల్లి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషా దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో కంఠమహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఉషా దయాకర్‌రావు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, ఏఎంసీ చైర్ పర్సన్ పసుమర్తి శాంత, సర్పంచులు కడెం యాకయ్య, పందుల యాకయ్య, మండల కోఆప్షన్ సభ్యులు అంకూస్ పాల్గొన్నారు.

### హక్కు పత్రాల పంపిణీ


**గంగారం:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పోడు భూముల లబ్ధిదారులకు అటవీ హక్కుపత్రాలు ఎంపీపీ సరోజన జగ్గారావు, జెడ్పీటీసీ ఈసం రమ సురేష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ, సర్పంచ్ సారక్క, బక్కయ్య, తుడుందెబ్బ నాయకులు యాదగిరి పాల్గొన్నారు.

### స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలి



**మహబూబాబాద్ అర్బన్:** జిల్లాలోని ప్రైవేట్ స్కూల్ బస్సులను, ఇతర వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు అన్నారు. జిల్లా కేందంలోని జిల్లా రవాణ శాఖ కార్యాలయంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రాథోడ్‌కు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గంధసిరి జ్యోతిబసు, నాయకులు ప్రవీణ్, వీరేందర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

### గుడిసె వాసులకు భూమిని ఇవ్వాలి



**కురవి:** ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న ప్రతీ పేదవాడికి భూమిని ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెవాసులు భారీ ర్యాలీ చేశారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రఫీకి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో పోగుల శ్రీనివాస్‌గౌడ్, కర్నం రాజన్న, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, బుడమ వెంకన్న, కొమురయ్య, సారయ్య, కృష్ణ పాల్గొన్నారు.

# వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

**గూడూరు:** మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయి బాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. పూజారులు ఆశీష్‌పాండ్యే, సతీష్‌పాండే పాలాభిషేకం చేయించారు. ఉదయం 11:30 గంటలకు సాయిబాబా విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి గంటపాటు మధ్యాహ్న హారతి కార్యక్రమం చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

**కురవి:** గురువులను గౌరవించడం మన సంప్రదాయమని గుండ్రాతిమడుగు(విలేజి) హైస్కూల్ హెచ్‌ఎం పి.లక్ష్మయ్య అన్నారు. సోమవారం మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామంలోని హైస్కూల్‌లో మహబూబాబాద్‌కు చెందిన భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో 'గురువందన ఛాత్రాభినందన' కార్యక్రమాన్ని నిర్వహించి గురువులను సత్కరించారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర బాధ్యుడు రేణికుంట్ల గణేష్, మార్గం శ్రీనివాస్, జయప్రకాశ్, విశ్వనాథం, ఉపాధ్యాయులు రఘువేందర్, లలిత, యాదగిరి, జబ్బరుల్లాబేగ్, నరేంద్ర పాల్గొన్నారు.

**మహబూబాబాద్ రూరల్:** సాయినాథుడి దివ్య దర్శనం వేడుకలను పట్టణంలోని శ్రీసాయి మందిరంలో సోమవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. నగర సంకీర్తనతో సాయి పూజలు ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై మంగాచార్యులు, సహ అర్చకులు రామానుజచార్యులు ఆధ్వర్యంలో సాయి మందిరంలోని షిర్డి సాయినాథుడికి కాకడ హారతి ఇచ్చారు. అనంతరం బాబాకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. శ్రీసాయి మందిర సేవా ట్రస్ట్ అధ్యక్షుడు వందనం కమల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి చంద్రప్రకాశ్, కోశాధికారి బొడ్డ రామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: సాయినాథుడికి పూజలు చేస్తున్న ట్రస్ట్ బాధ్యులు



కురవి: గురువులను సత్కరించిన భారత్ వికాస్ పరిషత్ బాధ్యులు

**మరిపెడ:** మరిపెడ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే వందలాదిగా హాజరై పూజలు చేశారు. అనంతరం ఆలయంలో మహా అన్నదానం చేశారు.

**డోర్నకల్:** స్థానిక సుభాష్ వీధి శ్రీషిర్డిసాయి ధ్యాన మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నగర సంకీర్తన, కాగడ హారతి, 108 కలశములతో అభిషేకాలు, సాయిబాబా విగ్రహానికి అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం సామూహిక వ్రతాలు, అన్నదాన కార్యక్రమం, సాయంత్రం సాయిబాబా విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు.



మరిపెడ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గూడూరు: ఆలయంలో హారతి ఇస్తున్న పూజారి

**చిన్నగూడూరు:** మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు వెంపటి విజయరాజ్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, కోలిపాక శ్రీనివాస్, సతీష్‌కుమార్, శ్రీలత పాల్గొన్నారు.

**గార్ల:** గార్లలోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సుదర్శన్ రావు, రమేష్‌బాబు, రాంబాబు పాల్గొన్నారు.



చిన్నగూడూరు పాఠశాలలో గురుపూజోత్సవం..



డోర్నకల్‌లో గురుపౌర్ణమి వేడుకలు



గార్ల: సాయిబాబా మందిరంలో..

### 'దివ్యాంగ బంధు' అమలు చేయాలి

**కేసముద్రం:** దివ్యాంగుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దివ్యాంగుల బంధు పథకాన్ని అమలుచేయాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెపాక శంకర్ డిమాండ్‌చేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. అదే విధంగా రూ.6వేల ఫించన్‌తోపాటు, డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేయాలన్నారు. ఈనెల 7న హనుమకొండలో నిర్వహించనున్న సంఘం జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కొనగొండ వెంకన్న, రాంపల్లి వెంకన్న, వీరన్న, యాకన్న, పద్మాకర్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు రక్త పరీక్షలు

**గూడూరు:** మండలంలోని అయోధ్యపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని బాలికల హైస్కూల్, బ్రాహ్మణపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధి నిర్మూలన కోసం బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ యమున, హెచ్‌ఎం స్వరూప, హెచ్‌ఈఓ లోక్యానాయక్, హెల్త్ సూపర్‌వైజర్ హేమలత పాల్గొన్నారు.

### గడపగడపకు బీజేపీ

**దంతాలపల్లి:** బీజేపీ చేపట్టిన మహా సంపర్క అభియాన్‌లో భాగంగా మండల కేంద్రంలో సోమవారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి, గడపగడపకు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తమిళనాడు నుంచి వచ్చిన విస్తారక్ జగన్, మహిళమోర్చా మండల అధ్యక్షురాలు సారెడ్డిరాణిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు సాయికుమార్, ఉమేష్ పాల్గొన్నారు.

## ఖమ్మం సభ విజయవంతంపై హర్షం

**మహబూబాబాద్ రూరల్:** ఖమ్మంలో జరిగిన జనగర్జన సభను విజయవంతం చేసిన మహబూబాబాద్ నియోజకవర్గ ప్రజలందరికీ పాదాభివందనం చేస్తున్నానని మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఖమ్మంలో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ గ్యారంటీ చేయూతతో ప్రజలందరికి మేలు కలుగుతుందన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో గడపగడపకు వెళ్లి వరంగల్ రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్‌తోపాటు కాంగ్రెస్ గ్యారెంటీ చేయూతను వివరిస్తామని, త్వరలో ఆ కార్యాచరణ మొదలు పెట్టబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు యాదవరెడ్డి, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాధ, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్నయాదవ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ నాయక్, నాయకులు అంజయ్య, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, సింగిల్ విండో బ్యాంక్ వైస్ చైర్మన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బలరాంనాయక్

**బీఆర్‌ఎస్ కుట్రలను తిప్పికొట్టిన జనం**

బీఆర్‌ఎస్ ప్రభుత్వం తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని వాహనాలను, ప్రజలను ఇబ్బంది పెట్టినా సరే ఆ కుట్రలను తిప్పికొట్టి అశేష జన వాహిని ఖమ్మం జనగర్జన మహాసభకు వచ్చారని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని, ఖమ్మం జనగర్జన సభను విజయవంతం చేసిన నియోజకవర్గ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నామని పేర్కొన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

**డోర్నకల్:** మండలంలోని పెరుమాళ్ల సంకీస జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం గ్రామానికి చెందిన మేడూరి రాధ, రంగనాథ్ దంపతుల సహకారంతో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, డిక్షనరీలను పంపిణీ చేశారు. సర్పంచ్ లక్ష్మి, హెచ్‌ఎం రామ్మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**చిన్నగూడూరు:** మండల కేంద్రంలోని గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన దివంగత దొంతు సత్తయ్య–సుశీల, వెంకన్న జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గుండంరాజుపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్స్ బుక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్ కుమార్, ఎంపీటీసీ మమత, తదితరులు ఉన్నారు.

**కేసముద్రం:** గురుపౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 40మంది విద్యార్థులకు హెచ్‌ఎం ప్రమీల నోట్‌బుక్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీచర్లు నాగయ్య, జనార్దన్, రజిత, జ్యోతి పాల్గొన్నారు.

## పోడు పట్టాల పేరిట అన్యాయం



మాట్లాడుతున్న రాంబాబునాయక్

**గూడూరు:** తెలంగాణ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన పోడు భూములకు పట్టాల కార్యక్రమంతో గిరిజన రైతులకు అన్యాయం చేస్తుందని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంబాబు నాయక్ ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఎన్నికలు దగ్గర పడుతున్న సమయం చూసి పోడు పట్టాల పేరిట గిరిజన రైతులను నమ్మించి మోసం చేసే ప్రయత్నం చేశాడన్నారు. చేపట్టి సర్వేలో అధికారులు నామమాత్రపు సర్వేలు చేశారన్నారు. ఒక్కో రైతుకు కొన్ని గ్రామాల్లో 5నుంచి 10 ఎకరాల పోడు సాగు భూమి ఉంటే, ప్రభుత్వం వారి పేర ఇచ్చిన పట్టాలో 2ఎకరాలు ఉందన్నారు. ఎన్నికల ముందు ఇలాంటి జిమ్మిక్కులు చేస్తే, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, బాలు, రమేష్, కోటేష్, అభిరాం, సుందర్ పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**జలాభిషేకం**

**కొత్తగూడ:** వర్షాలు కురవాలని మండలంలోని మైలారం మహిళలు గ్రామ దేవత బొడ్రాయికి సోమవారం జలాభిషేకం చేశారు.

**ట్రాక్టర్ ఇంజిన్ నుంచి విడిపోయిన డబ్బా**

**కేసముద్రం:** ఇనుగుర్తి మండలంలోని ఓ క్వారీ నుంచి గ్రానైట్ రాళ్లతో మానుకోటకు వెళ్తున్న ట్రాక్టర్ అమీనాపురం గ్రామంలో అధిక లోడ్ కారణంగా ట్రాక్టర్ ఇంజిన్‌కు, ట్రాలీకి మధ్యనున్న లింకు ఊడిపోయింది. దీంతో ట్రాలీ రోడ్డుపై కొంతమేరా వెళ్లడంతో తారులేచి రోడ్డు దెబ్బతింది.

**పండ్లు, బియ్యం పంపిణీ**

**దంతాలపల్లి:** మండలం పెద్దముప్పారం గ్రామంలో నెలకొల్పిన అమ్మఒడి అనాథ ఆశ్రమం సేవలు చిరస్మరణీయమని లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి క్లబ్ సభ్యురాలు చొల్లేటి రాజసుకన్య అన్నారు. సోమవారం రాజసుకన్య పుట్టిన రోజు సందర్భంగా సేవా తరుణి అధ్యక్షురాలు వజనపల్లి శైలజ ఆధ్వర్యంలో అనాథాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ, 50 కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి తుమ్మూరు శ్రీదేవిరెడ్డి, దీప, తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య**

**మహబూబాబాద్ అర్బన్:** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధికారత కల్పించడమే లక్ష్యమని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ ఎంఏ.రహీం అన్నారు. హైదరాబాద్‌లో సంస్థ వ్యవస్థాపకులు గంప నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో 36గంటలో 60మందికి అభ్యర్థులకు మోటివేషనల్ స్పీచ్‌పై ఆదివారం శిక్షణ ఇచ్చారు. అనంతరం రహీంకు సంస్థ నిర్వాహకులు సర్టిఫైడ్‌ను అందజేశారు.

**వైద్యులకు సన్మానం**

**మహబూబాబాద్ అర్బన్:** రోటరి క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వికాస్ డిగ్రీ కాళాశాలలో డాక్టర్ దినోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న డాక్టర్లను, పట్టణానికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్‌లను మహబూబాబాద్ రోటరీ క్లబ్ అధ్యక్షులు కొడారి నాగేందర్‌రావు, ప్రధాన కార్యదర్శి గూడురు నాగేశ్వర్ రావు సన్మానించి సత్కారించారు. కార్యక్రమంలో రోటరి క్లబ్ కోశాధికారి కిషోర్, లీగల్ అడ్వైజర్ తోరనాల నగేష్, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

**నాయకుడి మృతి**

**పెద్దవంగర:** మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన రైతుబంధు మండల కోఆర్డినేటర్ పాకనాటి సోమారెడ్డి సోదరుడు పాకనాటి వెంకట్ రెడ్డి (70) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు వెంకట్‌రెడ్డి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, శ్రీరాం సంజయ్, రాజు, విజయ్‌పాల్‌రెడ్డి పాల్గొన్నారు.

**చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి**

**గూడూరు:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని చిర్రకుంట తండాలో జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింత వీరస్వామి (50) ద్విచక్ర వాహనం శనివారం మండలంలోని మర్రిమిట్ట గ్రామంలోని బంధువులు ఇంటికి వచ్చి సాయంత్రం తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో గూడూరు సమీపంలో ఎన్‌హెచ్‌పై గల ముసలమ్మబాడువ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ఎల్లమ్మ, ఒక కొడుకు ఉన్నారు.

**ఇంటి గోడను ఢీకొట్టిన బొలెరో వాహనం**

**డోర్నకల్:** డోర్నకల్ నుంచి తహసీల్‌దారు బంజర వైపు వెళ్తున్న బలెరో వాహనం ఆమ్మపాలెం గ్రామంలోని ఓ మలుపు దాటిన తరువాత అదుపు తప్పి రెండు చెట్లను ఢీకొన్ని పొడకండ్ల అనసూర్యకు చెందిన ఇంటి గోడను ఢీకొట్టి నిలిచింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పింది.

**సిబ్బందిని పర్మనెంట్ చేయాలి**

**డోర్నకల్:** గ్రామ పంచాయతీలో అన్నిస్థాయిలలో పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరుతూ తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. సోమవారం ఎంపీడీఓ అపర్ణ, ఎంపీఓ మీర్జా మున్వర్‌బేగ్‌కు వినతిపత్రం అందించారు.

**పరామర్శ..**



**కేసముద్రం:** మండలంలోని ఇంటికన్నె గ్రామానికి చెందిన పెద్దముత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈమేరకు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను, మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్, ధన్నసరి సొసైటీ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు పరామర్శించారు.

**అమీనాపురం మార్చాలి**

**కేసముద్రం:** ఇనుగుర్తి పీహెచ్‌సీ పరిధిలో గల అమీనాపురం గ్రామాన్ని, కేసముద్రం పీహెచ్‌సీ పరిధిలోకి మార్చాలంటూ సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గ్రీవెన్‌సెల్‌లో వినతి పత్రాన్ని అందజేసినట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ తెలిపారు.

## 'దళితబంధు' ఎంపిక కలెక్టర్‌కు అప్పగించాలి

**నెహ్రూసెంటర్:** దళితబంధు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని దళితహక్కుల పోరాట సమితి జాతీయ సమితి సభ్యులు నర్ర శ్రావణ్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నర్ర శ్రావణ్ మాట్లాడుతూ.. దళితబంధు పథకంలో రాజకీయ జోక్యం లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ అభిలాషఅభినవ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ రాష్ట్ర సబ్ కమిటి సభ్యులు చింతకుంట్ల వెంకన్న, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి వంకాయలపాటి చిరంజీవి, పాల్, మంద శంకర్, ఆలేటి మహేష్ పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

## పాలకుర్తి ప్రజల గుండె చప్పుడునవుతా..



మాట్లాడుతున్న ఝూన్సీరెడ్డి

**తొర్రూరు:** దగాపడ్డ పాలకుర్తి నియోజకవర్గ ప్రజల గుండె చప్పుడునవుతానని ఎన్నారై, కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తెలిపారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో కాంగ్రెస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఝూన్సీరెడ్డి మాట్లాడుతూ.. అమెరికాలో 40 ఏళ్లు ఉన్నప్పటికీ తన మనసంతా పాలకుర్తి నియోజకవర్గ ప్రజలపై ఉందన్నారు. తమ కెలాంటి స్వార్థం లేని రోజుల్లో నియోజకవర్గంలో రూ.లక్షలు వెచ్చించి పలు మౌలిక సౌకర్యాలు కల్పించామని గుర్తు చేశారు. సంపాదన కోసం రాజకీయాల్లోకి రాలేదని ప్రజలను బాగు పర్చడానికే రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. ప్రజలు ఆశీర్వదిస్తే పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పరుస్తానన్నారు. తాజాగా ఖమ్మంలో జరిగిన జనగర్జన సభలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో మాజీ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. సమావేశంలో మాజీ టీపీసీసీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు జక్కుల రాంరెడ్డి, చెవిటి సదాకర్, గిరగాని కుమారస్వామి గౌడ్, పెద్ది కృష్ణమూర్తి, ముద్దసాని సురేష్, ప్రభాకర్, సురేష్ నాయక్, పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, కౌన్సిలర్లు భూసాని రాము, తూనం రోజా, నాయకులు పాల్గొన్నారు.

### రేపు మంద కృష్ణమాదిగ రాక

**మరిపెడ:** ఈనెల 5న మరిపెడకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మరిపెడకు రానున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ శాగంటి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**నెల్లికుదురు:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకంలో వంట చేసి పెడుతున్న వంట కార్మికులకు 20నెలలుగా రాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే అందించాలని వంట మహిళా కార్మికులు వెంకటమ్మ, అయిలమ్మ అధికారులను కోరారు. ఈమేరకు ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీఓ శేషాద్రికి, ఎంఈఓ గుగులోతు రాముకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వంట కార్మికులు సరళ, శ్రీలత, సరోజ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.




### చెత్త సేకరణ వందశాతం జరగాలి



**నెహ్రూసెంటర్:** మానుకోట మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా అమలు చేస్తూ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి సూచించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ శానిటేషన్ అధికారులు, జవాన్లు, డ్రైవర్లతో సోమవారం సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతి రోజు వార్డుల్లో ఇంటింటి చెత్త సేకరణ వందశాతం జరగాలని సూచించారు. జవాన్లు తమ పరిధిలో ఉన్న వార్డుల్లో ఒక వార్డు ఎంచుకుని వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. పారిశుద్ధ్య వాహనాల రిపేర్లు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీహరి, రాజేష్, జవాన్లు శ్రీనివాస్, మధుసూదన్, శ్రీను, కృష్ణ, డ్రైవర్లు పాల్గొన్నారు.